క్లుప్తంగా

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పరిసరాల శుభ్రత గురించి వివరించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పాటించాల్సిన పద్ధతులను వివరించారు. నీరు నిలిచి ఉన్న తొట్లలోని నీటిని తొలగించారు. వర్షాకాలం కావడంతో మురుగు నిలిచి ఉండకుండా చూసుకోవాలని చెప్పారు.

గౌతమ్ స్కూల్‌కు నోటీసులు

మంగళగిరి: నగరంలోని గౌతమ్ స్కూల్‌కు నోటీసులు జారీ చేసినట్లు ఎంఈఓ సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2016-17 సంవత్సరంలో స్కూల్ మూసివేసి గుర్తింపు రద్దు చేసినా నిర్వాహకులు యథావిధిగా స్కూల్ నడుపుతున్నారని సమాచారం రావడంతో నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. స్కూల్‌లో ఇప్పటికే చదువుతున్న పిల్లలను ఇతర స్కూల్స్‌లో చేర్పించి స్కూల్‌ను మూసివేయాలని నోటీసులో సూచించినట్లు ఎంఈఓ తెలిపారు.

రేపు కవి సమ్మేళనం

పాత గుంటూరు: నవ్యాంధ్ర రచయితల సంఘం, బాపు - రమణ - బాలు కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హాలులో ఆదివారం 'కవి మిత్రుల సంగమం-కవి సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు సంఘం స్టేట్ కో- ఆర్డినేటర్ డాక్టర్ రంగిశెట్టి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో డాక్టర్ రమణ యశస్వి రచించిన 'మా గణపవరం కథలు' పుస్తక సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సమ్మేళనంలో కవులంతా పాల్గొని కవితల్ని వినిపించాలని ఆయన కోరారు.

జగనన్న గోరుముద్ద నాణ్యత పరిశీలన




గుంటూరు ఎడ్యుకేషన్: మణిపురంలోని బొర్రా నాగేశ్వరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలను శుక్రవారం గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా జగనన్న గోరుముద్ద ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడకుండా కేటాయింపులు చేస్తున్న దృష్ట్యా, విద్యార్థులకు పరిశుభ్రమైన, బలవర్ధకమైన ఆహార పదార్థాల్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం జిలానీ బాషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

భావి ఉపాధ్యాయులుగా రాణించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఉత్తమ క్రమశిక్షణతో భావి ఉపాధ్యాయులుగా రాణించాలని ఆర్వీఆర్ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కళాశాలలో శుక్రవారం 2022-24 బ్యాచ్ విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగయ్య మాట్లాడుతూ సమాజంలో విద్యకు ప్రాముఖ్యత ఎంతో ఉన్నతమైనదని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా భావి ఉపాధ్యాయులుగా ఎదిగే బీఈడీ విద్యార్థులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య మోటూరి రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి



నెహ్రూనగర్: మణిపూర్‌లో అరాచకాల్ని అరికట్టి రాష్ట్రపతి పాలన విధించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో విధ్వంసానికి వ్యతిరేకంగా లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మణిపూర్‌లో ఎంతోకాలంగా దాడులు జరుగుతుంటే అక్కడ మీడియాని, పోలీసుల్ని కట్టడి చేసి గోప్యంగా ఉంచడం బీజేపీ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపి దోషుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాది వైకే, జి.ఆర్.భగత్‌సింగ్, జూపూడి శ్రీనివాసరావు, గంటా ప్రభుదాస్, సాంబశివరావు, సాంబయ్య, నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం

- మార్కెట్ యార్డు నిధులతో పలు రహదారుల నిర్మాణానికి శ్రీకారం
- త్వరలోనే మరో రూ.50 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయింపు
- రేవేంద్రపాడు బ్రిడ్జి నిర్మాణానికి త్వరలో అనుమతులు
- ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ



మాట్లాడుతున్న ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సహకారంతో దుగ్గిరాల మండలాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామని, ఇంకా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను సేకరిస్తున్నట్లు ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ పేర్కొన్నారు. శుక్రవారం దుగ్గిరాల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం వారు మాట్లాడుతూ గత సమావేశంలో రూ.1.50 కోట్లతో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, ఆ పనులు పూర్తికానున్నాయని, ప్రస్తుతం మార్కెట్ యార్డు నిధులతో చినపాలెం-కంతంరాజు కొండూరు, కంతంరాజు కొండూరు-నంబూరు, పెనుమూలి నుంచి కొలకలూరు రహదారులు నిర్మించడానికి ప్రతిపాదలను సిద్ధం చేసి అనుమతి కోసం పంపామని తెలిపారు. ఎఫ్‌డీఆర్ నిధులతో ఈమని నుంచి కూచివరం వరకు, పెదపాలెం నుంచి గొడవర్రు వరకు, పీఎంజీఎస్‌వై నిధులతో మంచికలపూడి సీసీఎల్ ఫ్యాక్టరీ దగ్గర నుంచి పెనుమూలి వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. దుగ్గిరాలలో ప్రధాన సమస్య అయిన రేవేంద్రపాడు బ్రిడ్జి నిర్మించేందుకు రూ.40 కోట్లతో ప్రతిపాదన సిద్ధం చేశామని, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చొరవతో కేంద్ర జలవనరుల శాఖ నుంచి అనుమతులు తీసుకువచ్చి నిర్మాణ పనులు చేపడతామని స్పష్టం చేశారు. మంగళగిరి-తెనాలి ప్రధాన రహదారిని రూ.6 కోట్ల 60 లక్షల వ్యయంతో మరమ్మతులు నిర్వహించి కొత్త రహదారిని నిర్మించడం, దుగ్గిరాల గ్రామంలో రూ.కోటితో ప్రధాన రహదారి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. దుగ్గిరాల మండల అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు కావాలని ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే ఆర్కేలను కోరారని, అవి కూడా మరో నెల రోజుల్లో మంజూరు అవుతాయని, దుగ్గిరాల మండలంలో ప్రతి గ్రామంలోనూ అవసరమైన సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు నిర్మించడంతో పాటు పలు ప్రాంతాల్లో కాలువల మీద బ్రిడ్జిలను కూడా నిర్మించేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

తోబుట్టువులకు జగనన్న ఆహ్వానం

ఇంటింటికి వెళ్లి బొట్టు పెడుతున్న డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు



లబ్ధిదారులకు బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న డ్వాక్రా యానిమేటర్లు

తాడేపల్లిరూరల్: కృష్ణాయపాలెంలో జగనన్న లే అవుట్‌లో నిర్మించే ఇళ్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలంటూ డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు శుక్రవారం ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్నారు. మంగళగిరి పట్టణ, రూరల్‌లోను, తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో 23 వేల మంది పైగా ఇళ్ల స్థలాలు పొందిన అక్కాచెల్లెమ్మలు ఉన్నారు. మరోపక్క తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో 24వ తేదీన లబ్ధిదారులకు అందజేయనున్న గృహ నిర్మాణ అనుమతి పత్రాలను, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని, మంజూరు లెటర్‌ను, ఇంటి పాసుపుస్తకాన్ని పరిశీలించి సిద్ధం చేస్తున్నారు. వీటన్నింటిని 24వ తేదీన వెంకటపాలెంలోని సభలో అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. 24 గంటల వ్యవధిలో మెప్మా అధికారుల సమక్షంలో ఎంటిఎంసి మెప్మా టీఎంఎం పావని ఇంటింటికి తిరిగి శంకుస్థాపన మహోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానిస్తున్నారు.

మండలంలో సమగ్ర ఓటర్ల సర్వే



పరిశీలిస్తున్న తహసీల్దార్ పద్మనాభుడు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్ల సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పద్మనాభుడు తెలిపారు. నుదురుపాడులో శుక్రవారం నిర్వహించిన సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తారని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కలిగేలా చూస్తామన్నారు. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్ల గుర్తింపు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు ఉంటాయని చెప్పారు. వందేళ్లు నిండిన వారిని గుర్తిస్తామని, డోర్ నెంబర్ లేకుండా ఒకే నెంబర్‌పై పదుల సంఖ్యలో ఉన్న ఓట్లు పరిశీలిస్తారని తెలిపారు. సర్వీసు ఓటర్లు, ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు వివరాలు సరిచేయడం, దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లను వారి ఇష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉన్నారో తెలుసుకుని అక్కడ జాబితాలో చేర్చేలా చేస్తామన్నారు. ఆగస్టు 21వరకు ఈ సర్వే కొనసాగుతుందని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఆర్‌ఐ రెహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు అందజేత

మంగళగిరి: నగరంలోని బాపనయ్యనగర్‌కు చెందిన ఓ నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నిత్యావసర సరుకులను అందజేశారు. బాపనయ్యనగర్‌కు చెందిన ఆవల తిరుపతమ్మ ఇటీవల భర్త మృతి చెందడంతో పాటు కుమారుడు రంగసాయి ప్రమాదానికి గురై కాలు విరిగి వికలాంగునిగా మారాడు. ఎమ్మెల్యే ఆర్కే స్థానిక నాయకుల ద్వారా శుక్రవారం రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, గౌస్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు టిఫిన్ బండ్లు

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాక, ప్రాతూరు గ్రామాల్లో ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో టిఫిన్ బండ్లను చిరు వ్యాపారులకు శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. పెనుమాక గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌బీ, ప్రాతూరు గ్రామానికి చెందిన షేక్ ఉమర్‌లకు టిఫిన్ బండ్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనుమాక కన్వీనర్ దామేష్‌రెడ్డి, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, విజయశేఖర్, అల్లు శ్రీనివాస్ రెడ్డి, బొక్క నాని, పులి భుజంగరావు, షేక్ బషీర్, ఆళ్ల సాంబిరెడ్డి, ప్రాతూరులో సత్యనారాయణరెడ్డి, ప్రాతూరు కోటేశ్వరరావు, సంకురు మరియబాబు, నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న వడ్డేశ్వరం గ్రామానికి చెందిన వడ్డేశ్వరం రాణికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నాయకులు కత్తిక రాఘవరావు, కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి)లు బాధితురాలికి శుక్రవారం ఆ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వడ్డేశ్వరం కన్వీనర్ గొడవర్తి శ్రీనివాసరావు, నాయకులు కన్వీనర్ షేక్ మీరాసా, వడ్డేశ్వరం రవి, చంద్రశేఖరరావు, వడ్డేశ్వరం పాల్ రాజు, చిలువూరి కరుణాకర్, వడ్డేశ్వరం కృపాకర్‌రావు, బుల్ల యేసుబాబు, గుడిసె రాజు, వడ్డేశ్వరం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నులకపేట తహసీల్దార్ కార్యాలయం, ఎఆర్‌ఓ కార్యాలయం ఎదురు ప్రాంతం, పోలకంపాడు, సాయినగర్ కట్ట, ఉండవల్లి సెంటర్, సినిమా హాల్ రోడ్, జామాయిల్ తోట రోడ్, చైర్మన్ బజార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని ఆయన కోరారు.

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాజ, చినకాకాని ఎన్నారై ఆసుపత్రి వెనుక ఏరియా, పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, పట్టణ పరిధిలోని ఆటోనగర్‌లోగల ఏపీఐఐసీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల నిమిత్తం నిడమర్రు రోడ్, ఆర్‌ఆర్ టవర్స్, టిడ్కో గృహ సముదాయం, ఆటోనగర్ ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఏర్పడే అంతరాయాన్ని గుర్తించి వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

అనుబంధ కార్మికులకు 'నేతన్న నేస్తం' వర్తింపజేయాలి

భట్టిప్రోలు: చేనేత అనుబంధ కార్మికులకు నేతన్న నేస్తం వర్తింపజేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ కోరారు. శుక్రవారం భట్టిప్రోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రిబేట్ బకాయిలు, సబ్సిడీలు, త్రిఫ్ట్‌ఫండ్ కంట్రిబ్యూషన్‌కు సంబంధించి సహకార సంఘాలకు అందాల్సి ఉందన్నారు. ఇవి అందితే చేనేత కార్మికులను ఆదుకున్న వారు అవుతున్నారని తెలిపారు. సమావేశంలో చేనేత నాయకులు దీపాల సత్యనారాయణ, బి.నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రహదారికి తాత్కాలిక మరమ్మతులు



అత్తోట(తెనాలి): కొల్లిపర మండల పరిధిలోని అత్తోట నుంచి కుంచవరం వెళ్లే రహదారి వర్షాలకు అక్కడక్కడ దెబ్బతింది. రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో స్వచ్ఛంద సంస్థ తాత్కాలిక మరమ్మతులకు ముందుకొచ్చింది. తెనాలిలోని పోస్ట్ స్వచ్ఛంద సంస్థ, ది అమరావతి మహిళా కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో పూర్తిగా రహదారి దెబ్బతిన్నచోట, శుక్రవారం రాళ్లతో కూడిన మట్టిని పోయించి రాకపోకలకు ఆటంకం లేకుండా చేశారు. ఇందుకోసం రూ.30 వేలు వ్యయం చేశారు. కుంచవరం గ్రామస్తులు ఆయా సంస్థల బాధ్యులను అభినందించారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి పాటుపడాలి: మేయర్



మేయర్ కావటిని సన్మానిస్తున్న మార్కెట్ యార్డు డైరెక్టర్లు

నెహ్రూనగర్: వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి, రైతులకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్‌నాయుడు సూచించారు. గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన పాలకమండలికి డైరెక్టర్స్‌గాఎంపికైన పాతకుంటి సుశీల, బొందలపాటి వెంకటేశ్వరరావు, గుడివాడ అరుణ శుక్రవారం నగర మేయర్‌ను సంపత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, బొకేతో ఆయన్ను సత్కరించారు. మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వ్యవహరించాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాస రెడ్డి, వెంకటరెడ్డి, బాలవెంకటరెడ్డి, బొందలపాటి భాస్కరరావు, భాస్కర్, గ్రంధి హనుమంతరావు, రఘు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ఎన్‌సీసీ కేడెట్లతో జూపూడి రంగరాజు, నాగభూషణం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్‌సీసీ బీ, సీ సర్టిఫికెట్ ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 25 ఆంధ్ర ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో నిర్వహించిన బీ సర్టిఫికెట్ పరీక్షా ఫలితాల్లో 17 మంది, సీ సర్టిఫికెట్ పరీక్షా ఫలితాల్లో తొమ్మిది మంది ఉత్తీర్ణులైనట్లు వివరించారు. విద్యార్థుల్ని కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అభినందించారు. విద్యార్థులకు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఓఎస్డీ పి. సీతారామయ్య, హవల్దార్ కె. గంగాధర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ సీహెచ్. అజిత్‌బాబు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ సమగ్రతకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

- అభ్యంతరాలుంటే రాజకీయపార్టీల ప్రతినిధులు వెల్లడించొచ్చు
- రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశంలో సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలి: ఓటరు జాబితా సవరణ కోసం నెలరోజులపాటు సంబంధిత అధికారులు ఇంటింటి సర్వేను చేపట్టనున్నట్లు తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ చెప్పారు. రాజకీయపార్టీలు ఇందుకు సహకరించాల్సిందిగా సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఓటరు జాబితా సవరణపై రాజకీయపార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు సమగ్ర ఓటరు సర్వే జరుగుతుందని ఆమె చెప్పారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో)లు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల పరిశీలన చేస్తారని తెలిపారు. చనిపోయినవారి పేర్లు, వేర్వేరు చోట్ల ఓటుహక్కు కలిగివుండడం, నకిలీ ఓట్లు వంటి వాటిని బీఎల్‌వోలు గుర్తిస్తారని తెలిపారు. కొత్తగా వయోజనులైన వారికి ఓటు హక్కు పొందే అవకాశం ఉందన్నారు. డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి పేర్లను, నకిలీ ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. వీటిపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చని చెప్పారు. ప్రస్తుతం ఓటరు జాబితా సవరణలోని నిబంధనలు, ఇతర అంశాలపై ఆయా రాజకీయపార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను గీతాంజలి శర్మ అడిగి తెలుసుకున్నారు.

పలు అభిప్రాయాలను వారు వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తిరుమలశెట్టి శ్రీనివాసరావు, అవుతు శేఖర్‌రెడ్డి, టీడీపీ నుంచి కాకుమాను కనకరాంబాబు, రావి సూర్యకిరణ్‌తేజ, వంగా సాంబిరెడ్డి, సీపీఎం నుంచి కొల్లిపర బాబూప్రసాద్, కాంగ్రెస్, జనసేన, సీపీఐ నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. తెనాలి ఇన్‌ఛార్జి తహసీల్దార్ హెనాప్రియ, కొల్లిపర తహసీల్దార్ జి.నాంచారయ్య, టీపీఓ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అన్ని స్థానాల్లో పోటీ

ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ టి.సేవకుమార్

గుంటూరు మెడికల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో ఉన్న 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తాతా సేవకుమార్ శుక్రవారం తెలిపారు. అన్ని జిల్లాల్లో పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌చార్జిలను నియమించామని చెప్పారు. త్వరలో పార్టీని బూత్ స్థాయికి, ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తామని పేర్కొన్నారు. ప్రజలతో కలసిమెలిసి ఉంటూ, ప్రజాసేవ చేసేవారికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజలు కూడా నిస్వార్థంగా ఆలోచించి, దేశం, రాష్ట్రం దశ దిశ మార్చగలిగిన ఆమ్ ఆద్మీ పార్టీకి సహకారం అందించాలని ఆయన కోరారు. త్వరలో ఆప్ మేనిఫెస్టోను విడుదల చేస్తామని వెల్లడించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి యువత, మహిళలు, స్థానికులు ముందుకు రావాలని ఆయన కోరారు. ఆసక్తి ఉన్నవారు 9848391212 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వినతి

తాడేపల్లిరూరల్: మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో కమిషనర్ అండ్ డైరెక్టర్ కార్యాలయంలో సంయుక్త సంచాలకులు శివపార్వతికి శుక్రవారం ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు దీనిని అమలు చేయలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చెత్త తరలించే ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, లారీ డ్రైవర్లను హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశామని తెలిపారు. ప్రభుత్వ శాఖాధిపతులు కలెక్టర్లు ప్రతి మూడో శుక్రవారం కార్మికులు, ఉద్యోగుల కోసం గ్రీవెన్స్ నిర్వహించాలనే ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ప్రతి నగరపాలక సంస్థ, పురపాలక సంఘంలో గ్రీవెన్స్ నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ గంజి రామ్మూర్తి, ఉపాధ్యక్షులు మల్లవరపు గణేష్, సంయుక్త కార్యదర్శి ఈర్ల రాము, ఈనాడు కమిటీ సభ్యులు పురుషోత్తమరెడ్డి, యూనియన్ కోశాధికారి నాగిపోగు సుమన్, కోటిబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం ప్రధాన రహదారికి మహర్దశ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి తదితరులు

పట్నంబజారు: నగరంలోని అత్యంత ప్రాముఖ్యత కలిగిన లక్ష్మీపురం ప్రధాన రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహనాయుడు శంకుస్థాపన చేశారు. రానున్న రోజుల్లో రహదారి కూడా 80 అడుగుల బీటీగా రూపు దిద్దుకోనుంది. నగరంలోని 32, 33 డివిజన్ పరిధిలోకి వచ్చే రహదారి నిర్మాణ పనుల్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలో గుంటూరు అంతా గుంతల మయంగా మారిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని చెప్పారు. దానిలో భాగంగానే లక్ష్మీపురం మదర్‌థెరిస్సా విగ్రహం నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ప్రధాన రహదారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ తన నియోజకవర్గమైన గుంటూరు పశ్చిమ ప్రగతిపథంలో పరుగులు పెడుతున్నట్లు చెప్పారు. ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎక్కడ ప్రజలకు చిన్న ఇబ్బంది తలెత్తినా తక్షణమే స్పందించి సంబంధిత అధికారుల్ని అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. తాజాగా మొదలైన అభివృద్ధి పనులతో లక్ష్మీపురం ప్రధాన రహదారి దశదిశ మారబోతున్నట్లు చెప్పారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గుంటూరులో లక్ష్మీపురం ఎంతో ముఖ్యమైన ప్రాంతమని, అనేక ప్రముఖ వ్యాపార సముదాయాలు ఉన్న ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన పాలకవర్గం ఏర్పడ్డాక గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ , గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ గోపీ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి, కార్పొరేషన్ అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగికి డీఆర్‌ఎం సాయం

లక్ష్మీపురం: నరసరావుపేటలో మూడు రోజులుగా రైల్వే లైను పనులు చేస్తున్న ట్రాక్‌మెన్ ట్రైనర్ కమలేష్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తక్షణమే స్పందించారు. వైద్య చికిత్స అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రత్యేక చొరవతో చికిత్సకు రూ.5 లక్షలు మంజూరు చేయించారు. చికిత్స అనంతరం కోలుకున్న కమలేష్, డివిజన్ రైల్వే సిబ్బంది డీఆర్‌ఎం చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన సెక్రటరీ రాఘవబాబు, ఆదినారాయణరెడ్డి, పలువురు సభ్యులు డీఆర్‌ఎం రామకృష్ణను శుక్రవారం సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ కాంప్లెక్స్‌లో మృతదేహం

తెనాలిరూరల్: తెనాలి మున్సిపల్ కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 మధ్య ఉంటుంది. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెంది రెండు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్ శుక్రవారం రాత్రి తెలిపారు.